
జైల్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేస్తున్న సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్


బాలాజీనగర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో జెండా వందనం చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి


విమ్స్‌లో జెండా ఎగుర వేస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు


ముడసర్లోవ వద్ద జెండా వందనం చేస్తున్న 13వ వార్డు కార్పొరేటర్ సునీత


విశాఖ వేలీ స్కూల్‌లో జాతీయ జెండాలు పట్టుకుని జవాన్ల వేషధారణలో విద్యార్థులు

మురిసిన మువ్వన్నెల జెండా

- వాడవాడలా స్వాతంత్య్ర వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆరిలోవ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అన్ని వార్డుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వార్డు సచివాలయాల్లో ఘనంగా జెండా వందనం చేశారు. 9వ వార్డు బీవీకే పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్య్ర సమర యోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. 10వ వార్డు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు జె.జయ ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లో జెండా ఎగుర వేశారు. సేవా స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు కూడా జెండా వందనం చేశారు. 11వ వార్డు బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. 12వ వార్డులో ఆరిలోవ పోలీస్ స్టేషన్ వెనుక సచివాలయం ఆవరణలో అన్ని సచివాలయాల సిబ్బంది, పలువురు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి జెండా వందనం చేశారు. 13వ వార్డు ముడసర్లోవ వద్ద ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కెల్ల సునీత జెండా ఎగుర వేశారు. విశాఖ వేలీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులు జవాన్ల వేషధారణలో అలరించారు.

– విశాఖ కేంద్ర కారాగారంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ ఇక్కడి పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగుర వేశారు. సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకుంది. అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు రామచంద్రరావు, కమలాకరరావు పాల్గొన్నారు.

– విమ్స్‌లో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు జెండా ఎగుర వేసి, ఈ ఏడాది ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా మహిళా ప్రాంగణంలో మేనేజర్ విమల, డీఈవో కార్యాలయంలో డీఈవో చంద్రకళ, జూ పార్కులో క్యూరేటర్ నందనీ సలారియా, రూరల్ తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రమణయ్య, ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ సోమశేఖర్, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో సూపరింటెండెంట్ వీరయ్య, ప్రభుత్వ బాలికల గృహంలో సూపరింటెండెంట్ సునీత జెండా వందనం చేశారు. జీవీఎంసీ 28వ వార్డులోని పలు చోట్ల వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, స్థానిక నాయకులతో కలిసి జెండా ఎగుర వేశారు.

ఎంవీపీ కాలనీ: ఉషోదయ కూడలిలోని కిడ్జి గార్డెన్ స్కూల్‌లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు. సెక్టార్–12లోని వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాడ దాసు పాల్గొని జెండా వందనం చేశారు. ఇగ్నో కార్యాలయంలో సంస్థ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గొనిపాటి ధర్మారావు జెండా ఎగుర వేశారు. సమత కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయరవీంద్ర జెండా వందనం చేశారు. సత్యసాయి విద్యావిహార్‌లో విశ్రాంత రియల్ అడ్మిరల్ ఆర్.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర జాతీయ జెండాను ఎగుర వేశారు. వాసవానిపాలెంలోని మత్స్యకార పాఠశాలలో మాజీ కార్పొరేటర్ పేర్ల విజయచందర్ జెండా వందనం చేశారు.

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మద్దిలపాలెంలోని ఎస్‌వీకే జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ జెండా వందనం చేశారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుజాత జెండా ఎగుర వేశారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా మలేరియా కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి ఎం.తులసీ జెండా వందనం చేశారు. పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు జి.వి.ఎస్.చలపతి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు.

ఏయూ క్యాంపస్: స్థానిక ఈస్ట్ పాయింట్ కాలనీలోని కేడీపీఎం పాఠశాలలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి జెండా ఎగురవేశారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. నౌకా నగర్ ప్రాథమికోన్నత పాఠశాల, చినవాల్తేరు సచివాలయం ప్రాంగణంలో కూడా ఆమె జెండా ఎగురవేశారు. స్థానిక ఎంఎల్‌బీటీ పాఠశాలలో గాయత్రి విద్యా పరిషత్ సంస్థ సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్.కామేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.మధురవాణి, సిబ్బంది, వరుణ్ మోటార్స్ ప్రతినిధి కుమార్ పాల్గొన్నారు.


12వ వార్డు సంతపాలెం పాఠశాలలో గాంధీ వేషధారణ విద్యార్థికి బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

విలువలే మన దేశ సంపద

ఏయూ క్యాంపస్: విలువలే భారత దేశానికి పెద్ద సంపదగా నిలుస్తాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ మైదానంలో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షించిన విధంగా నాణ్యమైన ఉన్నత విద్యను రాష్ట్ర యువతకు చేరువ చేస్తున్నామన్నారు. ముందుగా ఏయూ పరిపాలన భవనం వద్దనున్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, ఆచార్యులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపిక బహూకరిస్తున్న ఆచార్యులు

నిజాయితీకి దక్కిన గౌరవం


పాపమ్మను సత్కరిస్తున్న ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో రైతులు, డ్వాక్రా మహిళలు, సిబ్బందితో కలసి ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల నిజాయితీగా వ్యవహరించిన పాపమ్మ అనే మహిళా రైతును సన్మానించారు. ఓ మహిళ ఎంవీపీ రైతుబజార్‌లో పాపమ్మ స్టాల్ వద్ద ఆరు నెలల కిందట కూరగాయలు కొనుగోలు చేసి బ్యాగును మరిచి పోయి వెళ్లిపోయింది. ఆ బ్యాగులో రూ.10 లక్షలు విలువైన బంగారు నగలు, రూ.5 లక్షలు నగదు ఉన్నాయి. పాపమ్మ ఆ బ్యాగును భద్రపరిచి, తిరిగి అందజేసి, తన నిజాయితీని చాటుకుంది. ఆమెను ఉత్తమ రైతుగా ఎంపిక చేసి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సన్మానించినట్టు ఎస్టేట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు.


వివిధ వేషధారణలతో ఉన్న చిన్నారులతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


28వ వార్డులో జెండా వందనం చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల


జాతీయ పతాకం ఎగురవేస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు


వీఎస్‌కే జూనియర్ కళాశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్


కృష్ణా జూనియర్ కళాశాలలో విద్యార్థులు అద్భుత విన్యాసం


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య



ఎంఎల్‌బీటీ పాఠశాలలో సమరయోధుల వేషధారణలో చిన్నారులు


కేడీపీఎం పాఠశాలలో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

క్లుప్తంగా

హైడ్రోజన్ సిటీగా విశాఖ


ప్రసంగిస్తున్న ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా విశాఖ నగరాన్ని హైడ్రోజన్ సిటీగా తీర్చిదిద్దడంలో ఐఐపీఈ కీలక పాత్ర పోషిస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ అన్నారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ రంగంలో, పరిశ్రమల కోసం ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామ్‌పాల్ ద్వివేది, డాక్టర్ రాకా మండల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రిలో రిక్రియేషన్ హాల్ ప్రారంభం


రిక్రియేషన్ హాల్ ప్రారంభిస్తున్న డాక్టర్ పెదవీర్రాజు

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డాక్టర్ జయ నాగరాజ రిక్రియేషన్ హాల్‌ను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఇ.పెదవీర్రాజు ప్రారంభించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగుర వేసి, మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి, మౌలిక వసతుల కల్పనపై హర్షం వ్యక్తం చేశారు. రిక్రియేషన్ హాల్‌లో మినీ థియేటర్, దిన పత్రికలు, వార పత్రికలు, చెస్, క్యారమ్స్ వంటి ఆట వస్తువులను అందుబాటులో ఉంచినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. అనంతరం ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న డాక్టర్ ప్రజ్ఞమిత్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ వి.విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు సహకారం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: సృజనాత్మక ఆలోచనలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహిస్తున్న 'ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సామర్థ్యాల పెంపు'ఒక రోజు వర్క్‌షాప్ పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ నెల 31న నిర్వహించే ఈ కార్యక్రమంలో ఏయూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులు భాగస్వాములు అవుతారు. అత్యుత్తమమైన 5 ఆలోచనలను ఎంపిక చేసి ఏయూ ఆ హబ్‌లో స్థానం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య కె.రమాసుధ, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గౌతు లచ్చన్న జయంతి

సర్దార్ గౌతు లచ్చన్న జయంతి పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గ్రీన్ పార్క్ హోటల్ చేరువలో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద బుధవారం ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, పరిశోధకులు తాతారావు, జి.అశోక్, కె.సత్యం పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో చిక్కిన దొంగ

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో తరచూ దొంగతనానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతుబజార్‌లో ప్రతి మంగళవారం రైతులకు షాపుల కేటాయింపునకు సంబంధించి డ్రా తీస్తారు. ఈ సమయంలో రైతులంతా ఎస్టేట్ ఆఫీస్ వద్దకు వెళ్తారు. స్టాళ్ల వద్ద ఎవరూ ఉండరు. అలాంటి స్టాల్‌ను గుర్తించి రైతులు దాచిపెట్టిన నగదు తరచూ చోరీకి పాల్పడుతున్నాడు. దీనిపై బాధిత రైతులు ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. రైతుబజార్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఆ నగదు ఎవరు తీస్తున్నారో తెలిసేది కాదు. ఈ క్రమంలో మంగళవారం డ్రా తీసే సమయంలో కొందరు రైతులు, రైతుబజార్ సిబ్బంది దీనిపై నిఘా పెట్టారు. ఎప్పటిలాగే అలవాటుగా డెయిరీ ఫారం దరి ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఒక స్టాల్‌లో నగదు తీస్తుండగా రైతులు పట్టుకున్నారు. దీనిపై ఎస్టేట్ ఆఫీసర్ ప్రసాద్ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఇక్కడ దొంగతనం చేసినది తానేనని పోలీసుల ఎదుట ఆయన అంగీకరించాడు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఎంవీపీ రైతుబజార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విశిష్ట సేవలకు గుర్తింపు


రామమూర్తికి పురస్కారం అందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య వనం రూపశిల్పి, నిర్వాహకుడు డాక్టర్ మంధా రామమూర్తిని రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ కృష్ణ సత్కరించారు. మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా వృక్ష సంరక్షణకు రామమూర్తి సేవలను గుర్తిస్తూ అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ఉపకార ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార్ కప్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ నెల 7న ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో తూర్పు నియోజకవర్గం పరిధిలో 16 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ముగింపు సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచెర్ల అచ్యుతరావు, సినీ హీరో కంచెర్ల ఉపేంద్ర ట్రోఫీలు, ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం స్వాతంత్య్ర వేడుకలో భాగంగా జాతీయ జెండాతో పెదగదిలి నుంచి చినగదిలి వరకు ర్యాలీ చేపట్టారు.

రక్తదాన శిబిరం

ఎంవీపీ కాలనీ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సిరిపురం జగన్నాథస్వామి ఆలయం దరి ఉత్కల్ సమాజ్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉత్కల్ సమాజ్ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.


రక్తదానం చేస్తున్న యువకులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వర స్వామి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం జాతీయ గీతాలాపన నిర్వహించారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవం ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

శాకంబరి అలంకరణలో భూలోకమాత

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారి పక్కన ఉన్న భూలోకమాత నెల రోజుల పండగలో భాగంగా మంగళవారం శాకంబరి అలంకరణలో కనువిందు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



వ్యక్తి ఆత్మహత్య

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక దరి క్రాంతినగర్‌లో లింగాల శ్రీనివాస్(25) కలహాలు కారణంగా కొద్ది రోజులుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. భార్య కూడా అందుబాటులో లేదు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయన మంగళవారం ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహారాణిపేట: ఇంటి పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాంజీ ఎస్టేట్స్ పెదకొత్తూరు ప్రాంతానికి చెందిన రత్తి శ్రీనివాసరావు(32) అనే వ్యక్తి ఈ నెల 10న మెడ మీద గాజుపెంకుతో కోసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసి సమీపంలో ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి వచ్చాక ఈ నెల 11న ఉదయం 5 గంటలకు ఇంటి రెండో అంతస్తు పైకి వెళ్లి ప్రమాదవశాత్తు వెనక వైపు ఉన్న గెడ్డలోకి జారిపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటలకు ఆయన మృతిచెందాడు. మంగళవారం ఉదయం శ్రీనివాసరావు సోదరి కుమిలి రోజా ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన మానసిక పరిస్థితి బాగులేక గత ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం


జీవీఎంసీ 28వ వార్డులో సామాజిక భవనం ప్రారంభిస్తున్న విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 28వ వార్డు పీతవానిదిబ్బలో నిర్మించిన సామాజిక భవనాన్ని మంగళవారం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలసి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా దుర్గారావు ఈ నిర్మాణం కోసం సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

ఏయూ క్యాంపస్: భూగర్భ విద్యుత్ సరఫరా వ్యవస్థ సిద్ధం కావడంతో తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలను ఆ శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. స్థానిక 20వ వార్డు పరిధి ప్యాలస్ లేఅవుట్ ప్రాంతంలో మంగళవారం ఉదయం నుంచి స్తంభాల తొలగింపు పనులు చేపట్టారు. సిమెంట్ స్తంభాలను తొలగించి, ఇనుప స్తంభాలను ముక్కలుగా చేసి అక్కడి నుంచి తరలిస్తున్నారు. ఈ స్తంభాలను ఆధారంగా చేసుకుని వేసిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లు భారీగా తెగిపడ్డాయి. దీంతో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. మరో వైపు భూగర్భ విద్యుత్ వ్యవస్థ పూర్తికావడం, విద్యుత్ స్తంభాలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


క్రేన్ సహాయంతో విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

రోడ్డెక్కిన మురుగు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు ప్యాలస్ లేఅవుట్ నుంచి శ్రామికనగర్‌కు వెళ్లే మార్గంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ(యూజీడీ) నుంచి మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. ఓ మ్యాన్‌హోల్ వద్ద లీకేజీ ఏర్పడి భారీగా మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. జీవీఎంసీ సిబ్బంది వెంటనే దీనిని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు